# కొత్త రచయితలు

# హృదయాలు కలిసిన వేళ

## లవ్ స్టోరీ

టైమ్ చూశాను. నేను వచ్చి అప్పుడే గంట దాటింది. ఇంకా గాయత్రి రాదేం! అసలు వస్తుందా! రాదా? ఆ సందేహం నన్ను పట్టి పీడిస్తోంది. పార్కుకు రమ్మని చెప్పానే కాని వచ్చిన తరువాత ఏం మాట్లాడాలో అర్థం కావడం లేదు. ఏం మాట్లాడ కుండా వుత్తినే కూర్చుంటే...నా మీద ఏ అభిప్రాయం వుందో స్పష్టంగా తెలియడం లేదు.

మొదటిసారిగా కలుసుకున్నయువతీ యువకులు ఏం మాట్లాడుకుంటారు? ఎలాగైనా నామనసు విప్పి ఆమె ముందు పరచాలి...ఈసారి తనే ముందు మాట్లాడాలి...మాట్లాడాలి. ఒక్కసారి ఆమె పరిచయం ఐన వైనం కళ్ళ ముందు మెదిలింది.

* * *

"అంకుల్"

చటుక్కున కళ్ళు విప్పి చూశాను. ఎదురుగా పదేళ్ళ కుర్రాడు నా వైపే చూస్తున్నాడు. ఎప్పుడూ చూసిన గుర్తు లేదు.

"ఏమిటీ" అన్నాను.

"నా పేరు ప్రకాష్. ఇంట్లో అందరూ మిట్టూ అని పిలుస్తారు" అన్నాడు.

"ఎక్కడ మీ యిల్లు?"

"అదిగో ఎదురుగా కనిపిస్తోందే అదే..."

"అలాగా! నువ్వేం చదువుతున్నావోయ్?" ఏదో అడగాలి కాబట్టే అడిగాను.

"ఫిఫ్త్ క్లాస్ చదువుతున్నాను... మరి...మరి...మీ పేరేంటి?"

"గోపాల్"

"మీరేం చదువుతున్నారు?"

చెప్పాను.

"ఏ కాలేజీ?"

అది కూడా చెప్పాను. ఏంటీ వీడు ఏదో ఇంటర్వ్యూలో అడిగినట్లు అడుగుతున్నాడు. అయినా సమాధానం చెబుతూనే వున్నాను. "అవునూ ఇవన్నీ నీకెందుకోయ్?" అన్నాను.

"అబ్బే నాకోసం కాదంకుల్"

"మరి?"

"మా అక్క అడిగి రమ్మంటే వచ్చాను" అంటూ మెరుపులా మాయమయ్యాడు. ఉలిక్కిపడి తేరుకుని చూసే లోపు వాళ్ళింటి ముందు గేటు తీసుకుని లోపలికెళ్ళాడు. తను తెలుసుకున్న విషయాలు వాళ్ళక్కతో చెబుతున్నాడు. ఆమె మొహం సరిగ్గా కనిపించడం లేదు. తలంటు పోసుకున్న ఆమె కురులు ముఖాన్ని కప్పుతూ గాలికి ఆమె బుగ్గలపై ఆడుకుంటున్నాయి.

చెప్పడం ఐపోయింది కాబోలుమతారంగా వెంట్రుకల్ని పైకి తోసుకుంటూ ఇటువైపు చూసింది. నా గుండె వేగం హెచ్చింది.

"హలో" అంటూ చెయ్యి ఊపింది.

నీళ్ళల్లో ముంచినట్టు ఉక్కిరి బిక్కిరి అయ్యాను. గబుక్కున రూమ్‌లోకి వెళ్ళి తలుపు గడియపెట్టుకున్నాను. వళ్ళంతా చెమటలు పడుతున్నాయి. ఇదంతా కలా? నిజమా! అర్థం కావడం లేదు. ఒక అమ్మాయి తనను చూసి చెయ్యి ఊపడమా! ఆడవాళ్ళతో మాట్లాడాలంటేనే వణుకు పుడుతుంది నాకు. ఎందుకో ఏమో తెలియదు కాని మాటలు తడబడతాయి. పెదవులు వణుకుతాయి.

కళ్ళు మూసుకున్నా ఆమె గుర్తుకు వచ్చి హలో అని తట్టి లేపినట్టుగా అనిపిస్తోంది. ఎంత అందంగా వుంది ఆమె వదనం—అలాగే పడుకున్నాను. ఎప్పుడు నిద్ర పోయానో నాకే తెలియదు.

అలారం మోగుతుంటే లేచి కూర్చున్నాను. తెల్లవారి చాలా సేపైనట్టుంది. బయట అంతా సందడిగా వుంది. ఈ రోజు ప్రైవేట్ క్లాసు వున్న విషయం గుర్తుకు వచ్చి తొందరగా లేచి బ్రష్ చేసుకుని బయటకు వచ్చాను.

ఎందుకో అప్రయత్నంగా నా చూపులు ఆ ఇంటివైపు మళ్ళాయి. ఎవ్వరూ కనిపించలేదు కాని ఇంటి ముందు అందంగా ముగ్గులు తీర్చిదిద్ది వున్నాయి. ఆమే వేసి వుంటుందనుకున్నా! స్నానం చేసి వస్తుంటే ఎదురుగా ఆమె...నా కళ్ళ ముందర నాకు దగ్గరగా కొన్ని అడుగుల దూరంలో నిటారుగా నిలబడి పోయి చూస్తుండిపోయా. గొంతు తడి ఆరిపోతున్నట్టుగా వుంది.

"హాయ్..." ఆమె.

"ఆ...హ...ఆం" తడబాటు స్పష్టంగా తెలుస్తోంది. వెక్కిరించి కిలాకిలా నవ్వుకుంటూ నా పక్కనుండి వెళ్ళిపోయింది.

ఎలాగోలా రూమ్‌లోకి వచ్చిపడ్డాను. తొందరగా తయారై కాలేజీకి వెళ్ళిపోయాను. క్లాసులో ఒక్క ముక్క అర్థం కావడం లేదు. ఇంత గందరగోళం సృష్టి స్తుందేమిటి?

"ఏమిట్రా క్లాసు అయిపోయినా లేవడం లేదు? ఇంకా వినాలని వుందా ఆ సుత్తి!" స్నేహితుడు తట్టి కుదిపాడు.

ఎన్నో ఆలోచనలతో ఆ రోజు గడిచిపోయింది. కాని ఆమె మాత్రం రోజూ ఒక్కసారైనా కనిపించి నన్ను కలవర పరుస్తోంది. నా నుండి ఎలాంటి రెస్పాన్స్ లేకున్నా ఏవో సైగలు చేస్తుంటే...నాకెందుకో వణుకు పుడుతోంది. ఆడవాళ్ళంటే వణుకు...మాట్లాడాలంటే వణుకు...వాళ్ళ కళ్ళలోకి సూటిగా చూడాలన్నా వణుకు...ప్రలాభం లేదు.

విషయం మా స్నేహితుడికి చెప్పాను. వాడు నన్నో పిచ్చివాడిని చూసినట్టు చూసి "ఒరేయ్ ఫూల్ ఇంకా భయపడతావేం! ప్రొసీడ్ అవ్వు" అని చెప్పాడు.

"ఎలా?" అర్థం కాక అడిగా.

"దద్దమ్మా ఇంకా ఎప్పుడు నేర్చుకుంటావ్" అని కసురుకుంటూ "కనీసం హలో అన్నప్పుడు హలో అనైనా అన్నా బాబూ"

"కాని నోట్లోంచి మాట రావడం లేదే"

"అయితే నీ ఏడ్పేదో నువ్వే ఏడువ్"

ఈ రోజు ఎలాగైనా హలో అనాల్సిందే అని నిర్ణయించుకున్నాను. కాని...ఒక్కసారీ అగుపడదేం!

బయట కుర్చీ వేసుకుని చదువుకుంటున్నట్టు నటిస్తూ చూస్తున్నాను. ఇంకా కనిపించదేం అనుకున్నాను. కాని మూడు రోజుల వరకు కనిపించలేదు. నాకు మనసంతా ఏదోలా వుంది. ఎందుకో ఆమెను చూడాలనిపిస్తోంది. ఒక్కసారి...ఒక్కసారి...

నాకు తెలియకుండానే ఆమె గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టాను. కాని ఆమె కనిపించదేం. ఎలా?...ఆఁ ఐడియా! వాళ్ళ తమ్ముడిని పట్టుకుంటే?

ఓ రోజు మిట్టూను పట్టుకున్నాను. అవి ఇవి మాట్లాడిన తరువాత—

"మీ అక్క పేరు ఏంటోయ్" అన్నాను.

"చెప్పను"

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

"పోనీ...ఏం చదువుతోంది?"

"అదీ చెప్పను."

"ఎక్కడ చదివేదీ కూడా చెప్పవా?"

"చెప్పను"

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎందుకంటే-మా అక్క మీతో అస్సలు మాట్లాడ వద్దంది. మీరు ఏం అడిగినా చెప్పొద్దంది. మీతో మాట్లాడ్డం చూసిందంటే నన్ను తంతుంది."

"నీకు ఫైవ్ స్టార్ కొనిపెడతాను."

"లంచమా!"

"అబ్బే కాదు. చిన్న గిఫ్ట్" పెంకి ఘటంలా వున్నాడు.

"అయితే సరే! కాని ఒక్క పేరు మాత్రం చెబుతాను. మా అక్కయ్య పేరు గాయత్రి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

"గాయత్రి...గాయత్రి" ఉచ్చరిస్తుంటే ఎంత మధురంగా వుంది! ఒక రోజు ఉదయం బ్రష్ చేసుకుంటూ బయటికి వచ్చాను. గేటు దగ్గరగా గాయత్రి! "హలో" ఎలాగోలా కూడ బలుక్కుని పలుకరించాను. కోపంగా చూసి విసావిసా ఇంట్లోకి వెళ్ళిపోయింది. అవమానంగా ఫీలయ్యాను. ఎంతకంత కోపం? నాకూ కోపం వచ్చింది. అంతలోనే నవ్వు వచ్చింది. మరి ఆమె పలుకరించినప్పుడు నేను జవాబివ్వకపోతే ఆమెకెంత కోపం వచ్చి వుండాలి. ఈ ఆలోచన వచ్చాక నా కోపం పూర్తిగా పోయింది.

ఆమెను ప్రసన్నం చేసుకోవాలి. ఎలా? ఆలోచిస్తున్నాను.

సాయంత్రం వేళ బయట ఏదో చదువుకుంటోంది. చప్పట్లు కొట్టి పిలిచాను. చూసింది. "హలో" విష్ చేశాను. బదులుగా గ్రీట్ చెయ్యలేదు. కోపంగా చూస్తోంది.

"అలా చూడకు ప్లీజ్!" సైగ చేశాను. ఆమెతో ఎలాగైనా మాట్లాడాలి అంతే! "రేపు సాయంత్రం పబ్లిక్ గార్డెన్‌లో కలుద్దాం! తప్పకుండా రా ప్లీజ్" అని సైగల ద్వారానే చెప్పాను. వస్తుందో రాదో...

* * *

"హలో మిస్టర్ గోపాల్"

ఉలిక్కిపడి అటు చూశాను. ఎదురుగా ఆమె. ఇంత సేపూ ఎవరి కోసమైతే పడిగాపులు పడ్డానో ఆమె... ఎంత అందంగా వుంది! చూపు మరల్చుకోవడం కష్టంగా వుంది.

"ఏయ్...మిస్టర్ ఏంటా చూపు" గడుసుగా అంది.

"ఆ..." మాట్లాడబోయాను.

"ఏంటీ పార్కుకు రమ్మన్నావు! నీకెలా కనిపిస్తున్నాను. ఏదో పరిచయం చేసుకుందామని పలకరిస్తే పిల్లిని చూసిన ఎలుకలా పారిపోయే వాడివి. ఇప్పుడేమో డైరెక్ట్‌గా పార్కుకే రమ్మన్నావు అంటే..."

"అది కాదండి నా మాట కొంచెం..."

"ఏంటీ నీ మాట వినేది. ఆ...ఏదో మంచోడివి అనుకున్నాను కాని... ఇంత హీనంగా ప్రవర్తిస్తావను కోలేదు.



అమ్మాయిలంటే అంత ఎగతాళిగా వుందా నీకు. కనిపించిన దాన్నల్లా పార్కుకు రమ్మనడమేనా నీ పని... ఇంతకీ నా నంబరు ఎంతో చెప్పావు కావు" ఎడా పెడా దూకుతున్న ఆమె వాగ్దాటి నన్ను పిచ్చివాడ్ని చేస్తున్నది. ఏం మాట్లాడాలి! కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

ఇన్ని రోజులు తనే పలుకరించి, తన ఆలోచనలతో నన్ను పిచ్చివాడ్ని చేసి ఇప్పుడు తనే ఇలా...నో.. .నో...ఊహించలేక పోతున్నాను.

"సారీ అండీ...మీరేం మాట్లాడుతున్నారో, ఎందుకలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. మిమ్మల్ని పిలిచి అవమానించాననుకుంటే నన్ను క్షమించండి...వస్తాను!" వెనుతిరిగి రాబోయాను.

"ఇదేనోయ్ నీతో వచ్చిన చిక్కు. ఇంత అమాయకత్వమా" తన చేతితో నా చెయ్యి పట్టి ఆపింది.

ఆమె కళ్ళలో కొంటెతనం కనిపిస్తోంది.

"ఏంటీ, నిజంగానే ఫీలయ్యావా! ఊరికే సరదాకి అలా అన్నాను. నీ అమాయకత్వం చూసి మనసు పారేసుకున్నాను. నీకు ఎలా తెలపాలో అర్థం గాక, నీనుండి రెస్పాన్స్ లేక నాలో నేనే కుమిలి పోయాను. నిన్న నువ్వు పార్కుకు రమ్మనగానే నాకు ఎంత సంతోషం వేసిందో తెలుసా. నువ్వు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుని వుంటే ఏడిపించాలని అలా మాట్లాడాను అంతే..." చెబుతోంది.

సంతోషమో ఆశ్చర్యమో తెలియని ఉద్వేగం నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది "మీరు...మీరు చెప్పేది నిజమేనా?"

"ఇంకా మీరు అనడం ఏమిటి నన్ను. ప్లీజ్ అలా పిలవడం మానండి. నేనంటే మీకిష్టమేనా?"

నా యిష్టాన్ని ఆమెకెలా తెలియ చెప్పను "నా గుండె చేసే చప్పుడు విను నీకే తెలుస్తుంది" అప్రయత్నంగా ఆమె తలని నా గుండెలపై ఆన్చాను. నా హృదయం ఇంకా విప్పి చెప్పాల్సిన పనేముంది! ●


రచయిత చిరునామా

గడ్డం కృష్ణ

కె.వి.సి. పోతన హాస్టల్

హన్మకొండ—506 009

వరంగల్ జిల్లా